


ఒక సినీ దర్శకుడు కథలు కావాలని ప్రకటన చేశాడు. చాలామంది రచయితలు కథలు పంపారు. త్రిప్పి పంపటానికి బిళ్ళలు కూడా పంపారు. కాని ఒక్కటీ తిరిగి రాలేదు. ఆఖరుకు ఒక రచయిత సాహసించి దర్శకుని చూడటానికి వెళ్ళాడు. చాలా కష్టంమీద దర్శకుని దర్శనం లభించింది. తన గోడవ చెప్పుకున్నాడు.

"నీ కథ ఎన్ని పేజీలుంటుంది?" దర్శకుడు అడిగాడు.

"దాదాపు మూడువందల తావులు."

"అంత పెద్ద కథ చదవటం కష్టం. నాలుగు ముక్కల్లో రాసి పంపలేవా?" అన్నాడు దర్శకుడు.

"చిత్తం. మళ్ళీ రాసి పంపడ మెందుకు? ఇక్కడే రాసి ఇస్తా"నని కూచుని సంక్షిప్తకథ రాసి యిచ్చాడు.

దర్శకునికి కథ నచ్చి పాతిక రూపాయలు పారితోషిక మిచ్చి, ఆ కథ సినిమా తీయటానికి అన్ని భాషల హక్కులు కొన్నాడు. ఆ దర్శక నిర్మాత అనుమతితో యీ కథ ప్రచురిస్తున్నాము.

(షరా : ఈ కథ ఇంకా పెంచుకొనే హక్కులు తగ్గించుకునే హక్కులు కూడా నిర్మాతవే. పాఠకులిచ్చే సలహాలనుకూడా తీసుకునే హక్కు, తోసివేసే హక్కు నిర్మాతకు ఉంది.)

## మొదటి సీక్వెన్సు



ఔట్‌డోర్. వాటర్‌ఫాల్స్‌తో హీరోయిన్ జలకా లాడుతూ ఉంది. హీరో మెడకు ఒక కెమెరా తగిలించుకుని షూటింగుకు వస్తాడు. ఇద్దరూ ఒకరి నొకరు చూసుకుంటారు.

**బిచ్చగాడి పాట :**

కళ్లు కళ్లు కలిసినై

వొళ్లు ఝల్లు.........

బిచ్చగానిపాటకు అనుగుణంగా హీరో, హీరోయిన్లు హావభావాలు ప్రదర్శిస్తారు.

## రెండవ సీక్వెన్సు

పబ్లిక్‌పార్కు. హీరో హీరోయిన్ల పరిచయం స్నేహంగా మారుతుంది. హీరోయిన్ అనాథ. అంటే ఇంకా పెళ్లికాలేదు. హీరో ప్రేమ వ్యక్తం చేశాడు. హీరోయిన్ చాలా బెట్టుచేసి వొప్పుకుంటుంది.

**రేడియో పాట :**

పెదవి పెదవి తగిలింది

మదిర కైపు.........

పాటకు తగినట్టు హీరో, హీరోయిన్‌ల నటన.



## [ఇంటర్వెల్]

## మూడవ సీక్వెన్సు



**ఇల్లు**

హీరో సంపాదన ఇంటిఖర్చులకు చాలటంలేదు. హీరోయిన్ ఏకవస్త్ర, అంటే ఇంకా పెళ్లినాటి చీరతోనే ఉంటుంది. చిన్న చిన్న కలతలు. హీరోయిన్ ఉద్యోగం చేస్తానంటుంది. హీరో ఒప్పుకోడు. మాటమీద మాట పెరుగుతుంది.

**వీధిలో బుర్రకథ**

చేయి చేయి కలిసిందిరా-సై

**హాయ్ హోయ్............**

కథ టెంపోకు తగినట్టు హీరో హీరోయిన్ల యాక్షను.

## నాలుగవ సీక్వెన్సు

**కోర్టు**

లాయరు లాయరూ వాదన - ప్రతివాదన

హీరోయిన్ లాయరు :- మిలార్డ్ ! మా క్లయింటు తమలపాకు లివ్వవలసిన చేతితో విడాకులిస్తున్నదంటే ఆమె మనసు ఎంత రాయిచేసుకొందో తమరు గ్రహించి ఉంటారు. ఆమె శారీరక మానసిక బాధ ఊహించండి. విడాకు లిప్పించండి.



జడ్జి ప్రతివాది వాదన వినడు. మ్యారేజి సర్టిఫికేట్టు చించి వాద ప్రతివాదులకు సమానంగా పంచి పెడతాడు. హీరోయిన్ తన ముక్క కళ్లకద్దు కుంటుంది. హీరో ముక్క కాలికింద వేసి తొక్కుతాడు.

**బైరాగి తత్వం :**

పల్లవి : ఏమి ప్రేమలు, ఏమి మర్మములు

చరణం: దేవుడంతటి వాడికైనా.........